# కాదు మరి!

శ్రీ వెంకటశాస్త్రి

సూది మోపటానిక్కూడా వీల్లేనట్టుగావుంది. అట్లా నిండిపోయింది రైలు. అప్పటికీ వచ్చేవాళ్ళు వస్తూనేఉన్నారు. కాని లోపలికి వచ్చింతర్వాత ఏంచేయాలో ఎవరికీ తోచటంలేదు.

తీర్థప్రజలాగా అంతా ఆనాడేవచ్చారు.

యింతగా మేమెంతో యిబ్బందిపడ్తున్నా మా పక్కనకూర్చున్న కాలేజి కుర్రాళ్ళు భావకవిత్వంమీద మాట్లాడుతూనేఉన్నారు. ఒకరి గేయాలు మరొకరు విని ఎంతోగా ఆనందిస్తున్నారు.

ఊపులోవచ్చారు యిద్దరూ. ఆవిడచేతుల్లో పిల్లవాడున్నాడు.

ఎట్లాగోట్లా అవస్తపడుతూనేవచ్చారు. ఎవ్వర్నీ ఆపకూడదు అట్లాంటి సమయాల్లో! ఎవరి తొందర వారిది!

ఎందుకో వాళ్ళనుచూస్తే చాలామందికి జాలివేసింది. ఒక్కొక్కరి మొహం అట్లాంటి అభిప్రాయాన్ని కల్పిస్తుంది.

మాటోటివాళ్ళం లేచి ఆవిడకు చోటిచ్చాం.

ఆవిడ భర్తకు మరోచోట చోటుదొరికింది.

"రైలు కదిలితేనేగాని యీవెధవ వాసనపోదు" అన్నాడు భావకవి.

రైలు కదిలింది. మేం నిల్చున్నాం.

రైలు కదిలిందోలేదో ఆవిడచేతుల్లో పిల్లవాడు కెవ్వుమని ఏడుపు మొదలెట్టాడు.

మొదట్లో ఎవరమూ చలించలేదు. సాధారణంగా పిల్లలనైజమే అంత అని అనుకున్నాం.

వేగం హెచ్చుతూన్నకొద్దీ పిల్లవాడి ఏడుపు ఎక్కువయింది.

చిన్నపిల్లల ఏడుపూ ఆడదానిదుఃఖం ఎవర్నయినా కదిలిస్తయి.

కాని ఆవిడభర్త—ఆ పిల్లవాడితండ్రి, అంతేగామరి, అటుచూడను కూడా లేదు.

పిల్లవాడు—రైలుకదిలిందిఅని ఏడ్చేడేమో అనుకుంటె పక్క స్టేషన్లో రైలు ఆగినప్పుడయినా ఏడుపుమానలేదు.

మళ్ళా రైలుకదిలింది. ఏడుపు ఆగలేదు. తండ్రి అటు చూడనన్నా లేదు.

అట్నుంచి భావకవీ, యిట్నుంచి నేనూ, అతనితట్టు—శీతారామయ్యట అతని పేరు--చూశాం కోపంగా.

శీతారామయ్య ఏమీ చలించకుండా నాతట్టుచూసి "నిప్పెట్టైఉందా" అన్నాడు. దాన్నిపట్టి అతనితత్వాన్ని ఊహించుకున్నాం.

పిల్లవాడు పెద్దపెట్టున హోరుగా ఏడ్వుస్తున్నాడు. పాలాలు చూపించాం. తింటానికి బిస్కట్లుపెట్టాం. ఆడుకోటానికి వస్తువులు యిచ్చాం. భావకవి పాటలుకూడా పాడాడు. ఒకావిడ బంగారుగొల్సు యిచ్చింది. పిల్లవాడి ఏడుపుకు ఊపు ఎక్కువయిందిగాని తగ్గలేదు.

అయితే అప్పుడప్పుడు పిల్లవాడు తండ్రితట్టు చూస్తున్నాడు. తిరగా ఏడుపువస్తున్నది. అయితే ఆ తెర సముద్రపు అలలాగాఉంది.

కాని శీతారామయ్య పొగవదుల్తూ అది మేఘాల్లో ఎట్లా కలుస్తున్నదా అన్నట్టు చూస్తున్నాడు.

నా పక్కన ఉన్నవాళ్ళకు శీతారామయ్యమీద అమితమైన కోపం వచ్చింది. రాదు మరీ! తండ్రిఅన్నవాడికి తన సంతానంమీద రవంతయినా అభిమానం లేనప్పుడు తను కనటం దేనికి! అనవసరం. తండ్రిగా ఉండటానికికూడా ఓ అర్హతఉండాలి!

"ఆ మహర్రాజు యీ పిల్లవాడి తండ్రేనా" అన్నాడు ఓ ముసలాయన విసుగుపుట్టి.

నేనూ, భావకవీ, అడగదల్చుకుంది ఆయనే అడిగాడు.

ఆవిడ శీతారామయ్య తట్టు చూసింది. "ఆ" అంది. కాని ఆవిడకు కోపం వచ్చినట్లులేదు.

"మరి పిల్లవాణ్ణి తీసుకోడేం"—భావకవి.

"కొంతమంది తండ్రులుగాఉంటానికి అనర్హులు"—నేను అన్నాను.

మాటోటివాళ్ళం శీతారామయ్యమీద విరుచుకుపడ్డాం. అంత కరుడుగట్టిన హృదయం కలవాళ్ళు రాక్షసులేగాని మానవమాత్రులు కారన్నాం.

నేనూ, భావకవీ, శీతారామయ్యను—అతను ఊహించుకునేట్టుగా—ఎన్నితిట్టినా అతను చలించలేదు.

అందరికీ ఆశ్చర్యం కలిగింది యీ సంగతినిచూసి. మరి యిట్లాంటి మనిషెక్కడుంటాడు గనక!

"మొగవాళ్ళల్లో యిట్లాంటి వారున్నారంటె, నాపిల్లకు పెళ్ళే చెయ్యను" అన్నాడు భావకవి.

శీతారామయ్య నవ్వాడు. నేను ఆపుకున్నాను.

పోనీ ఆవిడన్నా శీతారామయ్యను ఏమన్నాఅందాఅంటే అదీలేదు.

నేనూ, మిగతావాళ్ళం కలిసి ఆ ఏడుస్తూన్న పిల్లవాణ్ణి ఆవిడచేతుల్లోంచి తీసుకెళ్ళి శీతారామయ్య చేతుల్లోపెట్టాం.

అందరం పిల్లవాడు ఏడుపు మానాడనుకున్నాం. కాని ఆ అవకాశాన్ని యివ్వడానికి యిష్టంలేనివాడి మోస్తరుగా, శీతారామయ్య వెంటనే తీసుకెళ్ళి ఆపిల్లవాణ్ణి ఆమెచేతికిచ్చాడు.

శీతారామయ్యను, ఏం అనాలో, ఏంచేయాలో ఎవరికీ పాలుపోలేదు.

శీతారామయ్య, అతని సంతతీ దిగిపోయింది ఆస్టేషన్లో. తర్వాత ఓ అరగంటదాకా అతని రాక్షసహృదయాన్ని పిల్లవాడి ఏడుపుకు కారణాల్నిగురించే మాట్లాడుకున్నాం.

*　　　*　　　*

ఓమారు శీతారామయ్య రైల్లోనే కన్పించాడు. ఆపిల్లవాణ్ణిగురించి (ఆ అబ్బాయి, ఏడుపుమాని బతికున్నాడా అని అనుమానం) అడగాలనుకున్నాను. కాని శీతారామయ్యతత్వం గుర్తొచ్చింది. అతన్తో మాట్లాట్టానికి అసహ్యం వేసింది.

"ఎవండోయి" అన్నాడు శీతారామయ్య.

యిద్దరమూ ఓచోటేకూర్చున్నాం.

"క్షేమమా"—శీతారామయ్య.

ఆనాడు అంతసంఘటన జరిగినా మాట్లాట్టానికికూడా లక్ష్యపెట్టని శీతారామయ్య యివ్వాళ యింతయిదిగా మాట్లాడుతున్నాడేం!

యిద్దరమూ సిగిరెట్లు ముట్టిచ్చాం.

"పిల్లవాడు బాగున్నాడా" అని అడగకుండా ఉండలేకపోయినాను. యింకా ఆనాటి చరిత్ర కళ్ళముందర కన్పిస్తూనేఉంది.

'ఆ' అన్నాడు శీతారామయ్య నిశ్చింతగా.

"చూశారూ"

"ఏమిటి?"

"నన్నుగురించి ఆరోజున అల్లా మాట్లాడుకున్నారుగదా. యింతకూ నేను వాణ్ణి లాలించలేదనేగా...."

"అవును మరి!"

"అసలు ఆ పిల్లవాడు నా పిల్లవాడుకాదు. దానిచెల్లెలికీ, నాతమ్ముడికీ కలిగాడు వాడు. వాడితల్లి చచ్చిపోయింది. ఆ మహా యిల్లాలు జ్ఞాపకం వచ్చి వాడట్లా ఏడుస్తుంటాడు. ఎవరు తీసుకున్నా వాడు ఆగడు" అన్నాడు శీతారామయ్య.

వింటూన్నంతసేపూ ఆశ్చర్యం వేస్తూనేఉంది.

ఊరుకోలేక, "అహ, అదిగాదు చెప్పేది. అంతమందికీ నీమీద అట్లా కోపం వచ్చిందికదా నువ్వు ఊరుకున్నావేం. ఎత్తుకోలేదేం! ఏడుపు మానడంటావా, అది వేరేసంగతి. నీ అభిమానం కాపాడుకోటానికయినా నువ్వు ఆపని చెయ్యాల్సింది."

"మీరూ అల్లా అంటారేం" శీతారామయ్య ఆశ్చర్యంతో అన్నాడు.

"వాడు నీ పిల్లవాడని అనుకున్నాంగా మరి"

ఎల్లా అనుకుంటారు చెప్పండి. తల్లి గంటనుంచీ ఎంతలాలించినా ఊరుకోని పిల్లవాడు తండ్రి తీసుకుంటేమట్టుకు ఆగుతాట్టండీ.

"అసలు మీరయినా ఊహించుకోవాల్సింది. తల్లిదగ్గర అంత అకారణంగా ఏడ్చినవాడు ఆవిడ పిల్లవాడుకాడని. అసలు సొంతపిల్లవాడయితే, తల్లి అనేపదార్థం మూడునిమిషాల్లో పిల్లవాడి ఏడుపును మాయం చేయ్యదండీ!" అన్నాడు శీతారామయ్య ఆవేశంతో. అరె! యిట్లాంటిది జరుగుతుందనుకోలేదు. ఏమిచెప్పటానికీ తోచలేదు. ప్లీడరు పరీక్ష చదువుతున్న నేను తెలివిగలవాణ్ణో, శీతారామయ్య తెలివిగలవాడో, నేనే నిర్ణయించుకున్నాను.